## చెక్కిన శిల్పంలా వున్న ఆమె చెదిరిన శిలలా మారిపోవడానికి కారణం?

# బ్రతుకుబాట





ప్రకాష్, వినోదిని భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. ఒకమ్మాయి, ఒకబ్బాయి. అద్దెఇళ్ల గొడవ పడలేక సొంతంగా ఒక ఇల్లు కొనుక్కోవాలని ఎంతగానో ఆశపడేవారు. కాని, వారి పేదరికంతో ఆ కోరిక తీరేదికాదు. ఏడాది... ఏడాది పెరిగిపోతున్న అద్దెల బాధ భరించలేక ఎలాగైనా ఇల్లు కట్టుకోవాలనుకున్నారు. కొంచెం ఊరికి దూరంగా తక్కువ ధరలో ఒక స్థలం కొనుక్కుని చిన్న ఇల్లు కట్టించుకున్నారు. ధైర్యంచేసి ఇల్లయితే కట్టించుకున్నారుగాని అప్పుల పాలయ్యారు. ''ఫర్వాలేదులే బాగా పొదుపుచేసి త్వరగా తీర్చేస్తాం'' చెప్పింది వినోదిని.

సొంత ఇంట్లో అదో ఆనందం... వున్న సామానుతోనే ఇంటిని చక్కగా దిద్దుకుని కాలం గడిపేవారు.

ఇల్లు చిన్నది అయినందువలన ఇంటిచుట్టూ బాగా ఖాళీస్థలం వుండేది. వినోదిని అందులో చెట్లపాదులు పెట్టింది. ఆమె ఒక్కటే కష్టపడడం చూసి ప్రకాష్కూడా హెల్ప్ చేశాడు. ఇద్దరు కలసి మంచి తోటని తయారుచేశారు. కొబ్బరిచెట్లు, మామిడి, జామ, అరటిచెట్లు, కూరగాయలు, పూలు, అన్నిరకాలువేసి బావిలోనుండి నీళ్లు ఒకరు లాగుతుంటే ఒకరు బిందెతో తీసుకెళ్లి చెట్టుకు పోసేవారు. ఇలా కలసికట్టుగా తోటని నవనవలాడేట్టుగా చేసుకున్నారు. వాళ్లని చూసి అందరూ అప్రిసియేట్ చేశారు.

ఇలా కాలం సాగుతున్న సమయంలో వినోదిని ఒక పత్రికలో ప్రకటన చూసింది. ఆమె మెదడు చురుగ్గా పనిచేసి... వెంటనే ఆ ప్రకటన అడ్రసుకు లెటరు రాసి అప్లికేషన్ తెప్పించుకుని... ఆ ఉద్యోగానికి అప్లయ్ చేసింది. ప్రకాష్కు చెప్పలేదు.




ఆ ఉద్యోగం వచ్చినప్పటి సంగతికదా... తర్వాత ఆలోచిస్తాం అని ఊరుకుంది. కాని ఆ జాబ్ ఆమెకు వచ్చింది. అప్పుడు మొదలయింది పెద్ద సమస్య. ప్రకాష్ ఆమెను వెళ్లవద్దన్నాడు. కాని వినోదిని ఊరుకోలేదు. ''ఇంత అప్పులపాలై వున్నాము చిన్నపిల్లలప్పుడే ఇంత కష్టమైతే... ఇక వాళ్ల కాలేజి చదువులకి, పెళ్ళిళ్లకి ఎలా?'' అని భర్తతో ఘాటుగా వాదించింది. చివరికి జాబ్‌లో

చేరింది.

చేరిన దగ్గరనుండి టైం దొరికేది కాదు. ఆదివారం సెలవు అయినా ఊపిరి సలుపుకోలేనంత ఇంటిపని అనిపించేది. అయినా వినోదిని అన్ని పనులు చక్కపెట్టుకునేది. ప్రకాష్ కూడా హెల్ప్ చేసేవాడు. రానురాను వినోదినిలో మార్పు రాసాగింది. ఆమెకు రావడం లేటయితే ఒక్కొక్కసారి వంటకూడా ప్రకాష్ చేయాల్సి వచ్చేది. ఏమని అడిగితే సమాధానం చెప్పేది కాదు. భార్యలోని మార్పుకి ప్రకాష్‌కి ఎంతో పశ్చాత్తాప పడిపోయాడు.

● ● ●

వినోదినికి తన ఆఫీసులో పనిచేసే ఒక బ్యాచిలర్ ఫ్రెండ్ పరిచయం అయ్యాడు. అతని మోటర్ సైకిల్‌మీద సినిమాలు, షికార్లు ఎక్కువైపోయాయి. ఇంటికి... ఆలస్యంగా వస్తున్న భార్యను నిలదీసి అడిగితే సమాధానం చెప్పక ఎదురుప్రశ్నలు వేసేది. ప్రకాష్‌కు చాలా కోపం వచ్చింది. జాబ్ మానేసి ఇంట్లో కూర్చోమని చెప్పాడు. అతని మాటకు ఆమె నిర్లక్ష్యంగా తల ఎగరేసి ''నేనేమి పిచ్చిదాన్నా వచ్చే ఆదాయం ఆపుకుని ఇంట్లో కూర్చునేందుకు'' అని కించపరిచేది. రానురాను ఆదివారంకూడా ఇంట్లో ఉండక వెళ్లిపోయేది. అది ప్రకాష్ పిల్లలకి చాలా బాధ కలిగించేది. అంత అన్యోన్యంగా వున్నవారిలో చీటికి మాటికి తగవులు జరుగుతుండేవి. ఇలా పిల్లల చదువులకు కూడా ఆటంకం అయిపోయింది. ఇంట్లో ప్రశాంతత మాయమైపోయింది. ఒకరోజు ఆ పేదరికాన్ని ఆ చికాకుల్ని ఆ అనుబంధాన్ని తెంచుకుని వెళ్లిపోయింది వినోదిని.

ప్రకాష్ పిల్లలు అలమటించారు వినోదిని చేసిన దారుణానికి. ఒకప్పుడు ఈ ఇంటిని, పిల్లల్ని, తనని ఎంత అపురూపంగా చూసుకునేదో వినోదిని ఇలా ఎలా అయిపోయింది. కేవలం తాత్కాలిక సుఖాలకే బానిస అయిపోయిందా? అని వాపోయాడు ప్రకాష్. ఇలా వుండగా అతని స్థితి... మరి చుట్టుప్రక్కలవాళ్ల సానుభూతి... అతనికి ఓదార్పు కలిగేదానికన్నా వారి సూటిపోటిమాటలు ఎక్కువ కష్టం కలిగించేవి. అయినా తన ఆవేదన్ని గుండెల్లో దాచుకుని... పిల్లల భవిష్యత్తుకోసం మనసుని రాయి చేసుకుని జీవితాన్ని కొనసాగిస్తుండేవాడు.

పిల్లలు పెద్దవాళ్లయినారు. పెరట్లో ఇద్దరు కలసి నాటిన చెట్లన్నీ పెద్దయి ఫలాలు ఇవ్వడం మొదలుపెట్టాయి. ఆ చెట్లను అంత ప్రీతిగా నాటి పెంచిన వినోదిని లేదు. పది మాసాలు కడుపున పెట్టుకుని రక్తం పంచిన బిడ్డల్నే వదిలి వెళ్లినప్పుడు ఈ చెట్లు చేమలు ఒక లెక్కా... అని విరాగిలా నవ్వుకునేవాడు ప్రకాష్.

● ● ●

కాలం ఒకరి కష్ట సుఖాలకోసం ఆగదని కాలం సాగిపోతూనే వుంది. రోజా ప్రకాష్ కూతురు చంద్రిక కాలేజీనుండి లోకల్ ట్రెయిన్‌లో ఇంటికి వెళుతూ వుంటుంది. ఆ రోజు ప్రాక్టికల్స్‌వలన ఆలస్యమయింది. రోజూ ఎక్కే ట్రయిన్ కాక వేరే ట్రయిన్ ఎక్కింది. అందులో కూర్చునేందుకు స్థలమే లేదు. ఎలాగో సర్దుకుని నిలుచుంది. కొద్దిసేపటికి పెద్దగా అలికిడి అయి అరుపులు, మాటలువినిపించాయి. అటుగా చూసింది చంద్రిక. అందరూ గుమిగూడి వున్నారు.

''ఏమిటి?'' అనడిగింది చంద్రిక.

''ఎవరో ఒకావిడ కళ్లు తిరిగి పడిపోయింది'' అని చెప్పి ''ఎవరివద్దయినా వాటర్ బాటిల్లో నీళ్లుంటే ఇవ్వండి... పాపం ముఖాన చిలకరిద్దాం'' అన్నారు.

చంద్రిక దగ్గరున్న వాటర్‌బాటిల్ తీసిస్తూ అటు చూసింది. అంతే ఆమె నవనాడులు చలించిపోయాయి. హృదయం విచ్ఛిన్నమైపోయింది. క్షణం ఊపిరే అందలేదు. తన కర్తవ్యం ఏమిటో తనకే బోధపడలేదు.


చివరికి ఆ అమ్మాయిలోని మానవత్వం మేల్కొంది. మెల్లగా ఆ పడిపోయిన వ్యక్తి దగ్గరగా వెళ్లి ఆమె తలని తన ఒడిలోకి తీసుకుంది చంద్రిక.

''ఏమిటమ్మా ఈ వాటర్ బాటిల్లో నీళ్లే లేవే...'' అన్నారెవరో.. చంద్రిక కనులనిండుగా నిండిన కన్నీళ్లు జలజలా రాలి ఆ వ్యక్తి ముఖంమీద పడ్డాయి.

ఎండిపోయిన ఆ యువతి జీవితానికి చంద్రిక కన్నీటిబొట్లే ఊపిరి పోశాయన్నట్లు మెల్లగా కళ్లు విప్పి చూసింది. ఆమె గాజు కళ్లల్లో ఎనలేని వేదనలు... పాలిపోయిన ఆమె ముఖం ప్రసన్నంగా అయింది. గుండె వేగంగా కొట్టు మిట్టాడిపోయింది. మాటలందక పెదవులు అలమటించిపోయాయి.

తల్లివైపు పరిశీలనగా చూసింది చంద్రిక. చెక్కిన శిల్పంలా వుండే తన తల్లి శిథిలావస్థలో వున్నట్లుంది. వెలిసిపోయిన నేతచీర చిరిగేందుకు సిద్ధంగా వున్న జాకెట్, శుష్కించిపోయిన శరీరం... వంటిమీద ఏ చిన్ని బంగారపు వస్తువు లేక బోసిపోయిన మెడ... ముక్కు... చెవులు... చేతులు వెళ్లేటప్పుడు వంటినిండా బంగారంతో వెళ్లిందే... అనుకున్న చంద్రికకు అర్థమైంది తన తల్లి ఎంత నష్టపోయిందో...

''చంద్రీ...'' కూతురి రెండు చేతులు గుండెల దగ్గరగా చేర్చుకుని పొదివిపట్టుకుని... ప్రేమగా... ఆ అమ్మాయి ముఖంలోకి చూస్తూ... ''ఇంకా ఈ తల్లిని మరచిపోలేదామ్మా!'' బొంగురుపోయిన



గొంతుతో అడిగింది వినోదిని.

విరక్తిగా నవ్వి... తల పంకించింది చంద్రిక.


''ఇంట్లోనుండి అడుగు బయటపెట్టి వెళ్లిన దగ్గరనుండి నేను బ్రతుకుబాటని కోల్పోయిన ఒక అభాగ్యురాలిని... ఆ నాటినుండి జీవించింది జీవితంకాదు. ఇదిగో ఈ రోజు నీ వడిలో తలదాచుకోగలిగానే... ఇదేనమ్మా నా నిజమైన జీవితం. కళకళలాడే నా బ్రతుకుబాటని కాలరాసి మీలాంటి మంచి మనసున్నవాళ్లని కోల్పోయినాను. అందుకే నాకీ శిక్ష. నన్ను మీరు ... మీ నాన్న క్షమించండి'' అంటూ చంద్రిక వడిలో తలదాచుకుని భోరున ఏడ్చింది వినోదిని.

ఏడుస్తున్న తల్లిని ఓదార్చాలని వుంది. కాని మనసు అంత సులువుగా అంగీకరించడంలేదు. తన తండ్రి పడిన కష్టాలు, అవమానాలు, ఎంత కష్టపడి వాళ్లని పెంచి పెద్దచేసింది... అన్నీ గుర్తుకొచ్చి మనసు పాషాణంగా మారిపోయింది. ఇలాంటి తల్లిని తీసుకువెళితే సంతోషిస్తాడా? ఆయన మంచి మనసున్నవాడే కావచ్చు. కానీ తల్లిచేసిన దారుణం అంతా ఇంతా కాదు. మరేమిటి తన కర్తవ్యం... ఆలోచిస్తున్న చంద్రిక.

రైలాగి అందరూ దిగి వెళ్లిపోవడం గమనించలేదు. రైలు ఆ స్టేషన్‌లో ఆగిపోయింది.

తల్లి రోదన వినిపించేది చెవులకే కాదు. హృదయాన్ని తట్టిలేపుతోంది. అయినా నిట్టూర్చి నిస్సహాయురాలిగా పైకి లేవబోయింది. కానీ ప్రేమగా పొదివిపట్టుకున్న తల్లి చేతులను విడిపించుకోలేకపోయింది. ఏదో బంధం ... ఏదో మానవ దృక్పథం... అడియాసతో సర్వసుఖాలను కోల్పోయిన ఆ స్త్రీపై దయ... జాలి కలిగి కఠినంగా లేచి వెళ్లిపోలేని చంద్రిక విలపిస్తోన్న తల్లివైపు చూసింది.

కట్టతెగిన ప్రవాహంలా కారుతున్న కన్నీళ్లను తుడిచి... ఆసరాగా ఆమె భుజంచుట్టూ చేతులు వేసి లేపింది. వాలిపోతున్న తలను... కూతురి భుజంపై వాల్చి ముందుకు నడిచింది వినోదిని.



డిజైన్: దాసరి కేశవరావు (గంగురేగు వలస)